మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 108 | గురువారం | 02 - 10 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం



2లో..








నగరూరి రాఘవేంద్ర



దివ్వెల మధుబాబు



ఉయ్యాల శ్రీనివాస్



పోకూరి బాబూరావు



రామాదేవి పెండ్యాల



సాయిబాబు కామినేని



ప్రసాద్ రెడ్డి అన్నారెడ్డి



చికటి సుహాసిని



బేరా వేణమ్మ



జె నాగముని



గోన చెన్నకేశవులు



తిరుమలశెట్టి శ్రీహరి



అబ్బూరి రమేష్ నాయుడు



మోహన్ జగదీష్ బాబు పమ్మి

# కొలువుదీరిన కొత్త డైరెక్టర్లు

(మనగళం ప్రత్యేక ప్రతినిధి): ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్(ఏపీఇడబ్ల్యూఐడీసీ) డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం విజయవాడ కుంచనపల్లిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగింది. కొత్త డైరెక్టర్లు కొలువుదీరారు. ముందుగా ప్రమాణ స్వీకారం చేయనున్న డైరెక్టర్లు, నాయకులతోపాటు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతనంతరం ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రాజశేఖర్ సమక్షంలో ఏపీఇడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎస్ దీవన్ రెడ్డి.... డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కర్నూలు బీజేపీ నేత నగరూరు రాఘవేంద్రతోపాటు అబ్బూరి రమేష్ నాయుడు, బేరా వేణమ్మ, చికటి సుహాసిని, దివ్వెల మధుబాబు, గోన చెన్నకేశవులు, జీ నాగముని, మోహన్ జగదీష్ బాబు, పోకూరి రాంబాబు, అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, రమాదేవి, సాయి బాబు, తిరుమల శెట్టి శ్రీహరి, ఉయ్యాల శ్రీనివాస్ కొత్త డైరెక్టర్లుగా కొలువుదీరారు. ఈ సందర్భంగా డైరెక్టర్లను సన్మానించారు. నాయకులు, రాజకీయ ప్రముఖులు, స్నేహితులు, బంధువులు డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ పాలన... అద్భుతం

**ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్(ఏపీఇడబ్ల్యూఐడీసీ) డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర**

కూటమి ప్రభుత్వ పాలన... అద్భుతం : కూటమి ప్రభుత్వ పాలన అద్భుతంగా ఉందని, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్(ఏపీఇడబ్ల్యూఐడీసీ) డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. ప్రధాని మోడీ సహకారంతో సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. గత పనికిమాలిన వైసీపీ నియంతపాలన మూలంగా రాష్ట్రాన్ని ఇవరై ఏళ్ల వెనక్కు నెట్టబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. చక్రవర్తులు, ఔరంగజేబు పాలనను గత ప్రభుత్వం సాగించిదని, నియంతలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. గౌరవం అంటే అర్థం తెలియని పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదన్నారు. రాక్షసులు... దేవతల అమృతం కోసం పోటీ పడిన విధంగా.... రాక్షసులను ఓడించి కూటమి నేతలు అధికారం చేపట్టారని, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. మంచి ఆలోచనలు ఉన్న నాయకులు కూటమిగా ఏర్పడితే ఎలా ఉంటుందనేది సీఎం చంద్రబాబు పాలన ప్రత్యక్ష సాక్ష్యమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అంకితభావం మూలంగా ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో పోలవరం ప్రాజెక్ట్ పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనూ తాను ఎడ్యుకేషన్ ఫీల్డ్ లో ఉన్నానని, ఇప్పుడు తనకు అదే వింగ్ లో అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. విద్యాభివృద్ధి అంకితభావంతో పాటుపడుతానని ఈ సందర్భంగా నగరూరు రాఘవేంద్ర స్పష్టం చేశారు.




## కేంద్ర ఉద్యోగులకు
# 3 శాతం డీఏ పెంపు

**- మొత్తం డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి పెరుగుదల**
**- లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లకు చేకూరనున్న లబ్ధి**

మన గళం, న్యూఢిల్లీ : పండుగల సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగులకు చెల్లించే కరవు భత్యం (డీఏ)ను మరో మూడు శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై కేంద్ర కేబినెట్ త్వరలోనే తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన విడుదల చేయనుంది. ఈ పెంపునకు కేబినెట్ ఆమోదముద్ర వేస్తే, మొత్తం డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి చేరుకుంటుంది. ఈ ఏడాది డీఏను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం. మార్చి నెలలో ప్రభుత్వం ఇప్పటికే 2 శాతం డీఏను పెంచింది. తాజా పెంపు నిర్ణయాన్ని ఈ ఏడాది జులై 1 నుంచే వర్తింపజేయ నున్నారు. దీంతో ఉద్యోగులకు మూడు నెలల బకాయిలు కూడా అందనున్నాయి. సాధారణంగా, వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు ఈ భత్యాన్ని అందిస్తారు. తాజా పెంపు వల్ల లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఉదాహరణకు, రూ.60,000 ప్రాథమిక వేతనం (బేసిక్ పే) ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం డీఏ రూపంలో రూ.33,000 అందుతుండగా, కొత్త పెంపు తర్వాత అది రూ.34,800కి పెరుగుతుంది. ఇదిలా ఉండగా, ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్ సిఫార్సుల మేరకు భవిష్యత్తులో జీతాలు, ఇతర అలవెన్సులపై స్పష్టత రానుంది. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చాక, ప్రస్తుత డీఏను బేసిక్ పేలో విలీనం చేసి సున్నాకు రీసెట్ చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# బలూచిస్థాన్ లో పాక్ ఆర్మీ డ్రోన్ దాడులు..

**- సొంత ప్రజలపైనే విరుచుకుపడుతున్న సైన్యం**



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: బలూచిస్థాన్ లో పాకిస్థాన్ సైన్యం భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రోన్లు, మోర్టార్లు, శతఘ్నులతో కుజ్దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంతంపై దాడి చేస్తోంది. సొంత ప్రజలపైనే సైన్యం విరుచుకుపడుతోంది. సైన్యం దాడితో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు, ఎటునుంచి బాంబు వచ్చి మీదపడుతుందోననే భయంతో ఇళ్లల్లోనే ఉండిపోతున్నారు. నాలుగు రోజులు గా కొనసాగుతున్న ఈ ఆపరేషన్ టార్గెట్ ఉగ్రవాదుల ఏరివేతేనని సైనిక వర్గాలు వెల్లడించాయి. సైన్యం చేపట్టిన ఈ ఆపరేషన్ తో ప్రజలు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయారు. ఇళ్లల్లో నుంచి బయటకు అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఆహార కొరతతో అక్కడి ప్రజలు అల్లాడుతున్నారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. సైన్యం ప్రయోగిస్తున్న బాంబుల వల్ల పత్తి పొలాలన్నీ ధ్వంసమయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నాయి. ఛశ్మా ప్రాంతంలో శతఘ్నులు, మోర్టార్ల కారణంగా పలువురు పౌరులు మరణించినట్లు సమాచారం. బలోచ్ లిబరేషన్ ఆర్మీ, బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. ప్రస్తుతం జెహ్రీ ప్రాంతమంతా ఉగ్రవాదుల చేతుల్లో ఉందని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొనే లక్ష్యంతో దాడులు చేస్తున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం

మన గళం డెస్క్ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు.

# 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం

**- విజయనగరం జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు**
**- సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్న సీఎం**
**- రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడి**



మన గళం, అమరావతి : ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు.

కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్ చేశామని, అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మహిళల కష్టాలు తీర్చేందుకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. "స్త్రీ శక్తి" పథకం కింద ఆగస్టు 15న ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేవలం 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.6,000 జమ చేశామని, త్వరలోనే మరో రూ.14,000 అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదని చెబుతూ, ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

# ఈ కేసులన్నీ ఒక్క రోజులో పోయేవే

**- తనపై అక్రమ కేసులు పెట్టారు**
**- జగన్ కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొంటామని వ్యాఖ్య**
**- రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా**
**- మిథున్ రెడ్డి**



మన గళం, అమరావతి : ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయి, బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అధికార కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై పెట్టినవి అక్రమ కేసులని, వీటిని చూసి భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. జైల్లో తనను ఒక ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, రాష్ట్రంలో మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం మిథున్ రెడ్డి ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని వేధించడం, మాపై కేసులు పెట్టడం మామూలే. కేవలం మమ్మల్ని మానసికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ అక్రమ కేసులు పెట్టారు. ఇలాంటి వాటికి భయపడతామని అనుకుంటే అది వారి భ్రమే అవుతుంది. ఇవన్నీ ఒక్కరోజులోనే వీగిపోయే కేసులు" అని ఆయన కొట్టిపారేశారు. రెండున్నర నెలల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చిందని, అక్కడ తనను చాలా ఇబ్బందులకు గురి చేశారని మిథున్ రెడ్డి తెలిపారు. అయితే, తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు, తమ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. "మా అధినేత జగన్ మా వెంటే ఉన్నారు. మా కుటుంబానికి ఎవరికీ ఇవ్వని గుర్తింపు ఇచ్చారు. ఆయన కోసం, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తీసుకురావడం కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొంటాం, ఎన్ని ఇబ్బందులైనా భరిస్తాం" అని ఆయన అన్నారు. కోర్టు ఆంక్షల కారణంగా కేసు గురించి ఎక్కువగా మాట్లాడలేనని, ఎన్ని కష్టాలు పెట్టినా అధైర్యపడేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

# తీరం వైపు దూసుకొస్తున్న వాయుగుండం

**- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం**
**- రేపు ఉదయానికి వాయుగుండంగా బలపడే అవకాశం**
**- 3న ఉత్తర కోస్తా - దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే ఛాన్స్**
**- కోస్తాంధ్ర, తెలంగాణకు నేడు ఎల్లో అలర్ట్ జారీ**
**- గురు, శుక్రవారాల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడే అవకాశం**
**- తీరం వెంబడి మూడు రోజుల పాటు బలమైన ఈదురు గాలులు**



మన గళం, అమరావతి : తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేడు కోస్తాంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రేపు తెల్లవారుజాము నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత కూడా ఇదే దిశలో ప్రయాణించి, 3వ తేదీన దక్షిణ ఒడిశా – ఉత్తర కోస్తాంధ్ర మధ్య తీరాన్ని దాటవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీనికి తోడు రాగల మూడు రోజుల పాటు తీరం వెంబడి గంటకు 30 కిలోమీటర్లకు పైగా వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# దేశం అన్ని విధాలా ఎదగాలనే స్వదేశీ నినాదం

మన గళం, అమరావతి : బీజేపీ ప్రభుత్వంలో భారత దేశ ఖ్యాతిని విశ్వ వ్యాప్తం చేసిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. స్వజాతి, స్వదేశీపై గౌరవ భావం కలిగేలా మోదీ పాలన, నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా ఆత్మ నిర్భర్ భారత్ అమలు చేస్తుందని చెప్పారు. 'అమెరికా.. మన దేశం మీద సుంకాల యుద్ధం, ఆంక్షలు ప్రకటించింది. మన దేశం అన్ని విధాలా ఎదగాలని మోదీ స్వదేశీ నినాదాన్ని తీసుకున్నారు' అని మాధవ్ తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా ఇదే స్వదేశీ ఉద్యమంలో మహనీయులు పాల్గొన్నారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఇతరుల ఆదేశాల మేరకు మన దేశంలో నిర్ణయాలు జరిగాయన్నారు. విదేశీ ఆలోచనలతో, విదేశీ కంపెనీలు ప్రోత్సహించారని... ఖాధీని పక్కన పెట్టడం వల్ల భారతదేశం బలహీన పడిందన్నారు. ప్రతి విషయంలో విదేశాలపై ఆధార పడే పరిస్థితికి తెచ్చారని విమర్శించారు. ఏ చిన్న పరికరం కావాలన్నా కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే విధంగా చేశారన్నారు. కార్గిల్ యుద్ధం సమయంలో శవ పేటికలను కూడా విదేశాల నుంచి తెచ్చారని.. అప్పుడు వాజ్ పాయ్ వంటి వారు మన దేశంలోనే తయారు చేయాలని ఆదేశించారని.. ఆ తరువాత మోదీ పాలనలోనే భారత దేశం అన్ని విధాలా వృద్ధి చెందిందని చెప్పుకొచ్చారు. 2014 నుంచి మోదీ స్వాలంబన అడుగులు బలంగా వేశారన్నారు. అంతర్జాతీయ యోగా దేను జూన్ 21న ప్రపంచం మొత్తం జరిపేలా మోదీ చేశారని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, ఈజ్ ఆఫ్ డూయింగ్ ద్వారా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. కుటీర పరిశ్రమలకు ప్రత్యేక ప్యాకేజీ లు కూడా ఇచ్చారని.. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ మనమే తయారు చేసి అనేక దేశాలకు ఎగుమతి చేశామని తెలిపారు. ఇతర దేశాలకు కూడా ఇచ్చి కోట్లాది ప్రజల ప్రాణాలను కాపాడామని బీజేపీ అలాగే షర్మిలపై మాధవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. షర్మిలకు ఆర్ఎస్ఎస్ అర్థమే తెలియదని వ్యాఖ్యలు చేశారు. మత విద్వేషాలు రెచ్చ గొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# జీఎస్టీ పన్నులు తగ్గాయి...ప్రయోజనం పొందండి

- దుకాణదారులు పాత రేట్లకు అమ్మొద్దు
- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, కర్నూలు సిటీ : జీఎస్టీ పన్నులు గణనీయంగా తగ్గాయని, ప్రజలు ప్రయోజనం పొందాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక భగత్ సింగ్ నగర్ లో జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి





పంపిణీ చేసి, జీఎస్టీ పన్నుల తగ్గింపు పై జిల్లా కలెక్టర్ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సి క్యాంప్ రైతు బజార్ లో ప్రజలకు, దుకాణదారులకు జీఎస్టీ పన్నుల తగ్గింపు గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, ఆరోగ్య సంబంధిత సామాగ్రి, డైరీ, బేకరి ఉత్పత్తులు, స్టేషనరీ, బైక్, కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రైతులకు సంబంధించి ట్రాక్టర్ లు, ఇతర వ్యవసాయ పరికరాలు, తదితర వస్తువులకు గణనీయంగా జీఎస్టీ పన్నులు తగ్గాయని కలెక్టర్ వివరించారు. నిత్యావసర సరుకుల మీద జీఎస్టీ పన్ను తగ్గించడంతో ప్రతి నెల కుటుంబానికి 1000 రూపాయల వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు. షాపింగ్ కి వెళ్లినపుడు షాప్ వారు వేస్తున్న ధరలను గమనించాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. రైతు బజార్ లో దుకాణదారులతో మాట్లాడుతూ వస్తువులు పాత ఎమ్మార్పీ ధరలకు అమ్మకూడదని స్పష్టం చేశారు. అలా అమ్మితే ప్రజలు నిలదీయాలని కలెక్టర్ సూచించారు. జీఎస్టీ పన్ను తగ్గింపు ప్రయోజనాలను గురించి పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని కలెక్టర్





అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బన్ని ఉత్సవ నిబంధనలు పాటించాలి

మనగళం, కర్నూలు క్రైం : దసరా పండుగను పురస్కరించుకొని అక్టోబర్ 2 (గురువారం) వ తేది రాత్రి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరిగే దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని సంప్రదాయ సంబరంగా ప్రశాంతంగా జరుపుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బన్ని ఉత్సవం ఏర్పాట్లు, ప్రజలు పాటించాల్సిన నిబంధనలను ఎస్పీ వివరించారు. ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, పోలీసుల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. ఉత్సవాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. 110 సీసీ కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలకు ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 20 బెడ్ లతో ఒక తాత్కలిక ఆసుపత్రి కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవంలో ఎవరైనా గాయాల పాలైతే వారి కొరకు 104, 108 అంబులెన్స్ వాహానాలు ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా డీస్పీ, సీఐలు, ఎస్పైలతో 15 రోజుల నుండి వరుసగా 20 నుండి 30 చుట్టు పక్కల గ్రామాల ప్రజలలో అవగాహన కల్పించేందుకు సంబరంలాగా ప్రశాంతంగా జరుపుకోవాలని అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. బన్ని ఉత్సవంలో పరిసర గ్రామాల నుండి 1.5 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఉత్సవంలో ఊరేగింపుగా వెళ్ళడానికి దేవుని ముందు నాట్యం, విన్యాసాలు చేసే దానికి రాత్రి వేళ కర్రలతో వెళ్ళడంలో కొందరు వ్యక్తులు కావాలనే మనస్పర్థలు, పాత కక్షలతో దాడులకు పాల్పడి గాయాలు చేసుకుంటున్నారన్నారు. 200 మంది ట్రబుల్ మాంగర్స్ , నాటుసారా అమ్మే వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. కార్డన్ సెర్చ్ లలో నాటుసారా, 340 రింగుల గల కర్రలు సీజ్ చేశామన్నారు. దేవరగట్టు పరిసర ప్రాంతాలలో 5 చెక్ పోస్టులు, 10 పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. చాలా వరకు గాయాలు కాకుండా చూస్తామన్నారు. బన్ని ఉత్సవం సంబరం లాగా



- సంప్రదాయాలను పాటిస్తూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- 700 మంది పోలీసులతో పటిష్ట భద్రత
- 340 రింగుల కర్రలు సీజ్ చేశాం
- 200 మంది ట్రబుల్ మాంగర్స్ బైండోవర్
- ఉత్సవం ముసుగులో గొడవలకు పాల్పడొద్దు
- చిన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తలు చూసుకోవాలి
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆచారించాలని దేవరగట్టు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బన్ని ఉత్సవం కు ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 7 మంది డీఎస్పీలతో పాటు 700 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవానికి పెద్దఎత్తున జనం వస్తారని, చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.

# ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీ చేయాలి




- జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 16 వ తేదీన జిల్లాలోపర్యటించనున్నట్లు ప్రాథమికంగా సమాచారం అందిన నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కాలేదన్నారు. అయితే ప్రాథమికంగా సమాచారం అందిన నేపథ్యంలో ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నగరంలో 4 వేల మందితో సమావేశం, రోడ్ షో నిర్వహించే అవకాశం ఉన్నందున వేదిక, వాహనాల పార్కింగ్, హెలిపాడ్ ఏర్పాట్లపై ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి ఎస్ ఈ తదితరులతో చర్చించారు. నగరంలో సుందరీకరణ, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ ను ఆదేశించారు. హెలిపాడ్ ల నిర్మాణంపై ఆర్ అండ్ బి ఎస్ ఈ తో చర్చించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు రోడ్ షో నిర్వహణ, పార్కింగ్ అంశాలపై సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు..

సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, డీఎస్పీ బాబూ ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు హెడ్ క్వార్టర్స్ లో భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ





మనగళం, కర్నూలు క్రైం : జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతులు బుధవారం ఆయుధ పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పోలీసు ఆయుధాగారంలో పోలీసులు వినియోగించే ప్రతీ ఆయుధాన్ని అలంకరించారు. దుర్గాదేవి చిత్రపటానికి, జమ్మిచెట్టుకు, పోలీసు వాహానాలకు పూజలు చేశారు. విజయాలకు చిహ్నామైన ఈ విజయదశమి అందరికీ విజయం చేకూర్చాలని, సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏపీఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు, పోలీసులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూల్ డీఎస్పీ జె. బాబు ప్రసాద్, సీఐలు, ఆర్ ఐలు , ఆర్ ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ లో రూ.103.88 కోట్లు పెన్షన్లు పంపిణీ



- లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసిన జిల్లా కలెక్టర్ సిరి

కర్నూలు, కలెక్టరేట్ : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అక్టోబర్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 39 వేల 256 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ.103.88 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా స్థానిక భగత్ సింగ్ నగర్ వీధిలో షేక్ మాబి, మౌలా హుస్సేన్, లక్ష్మయ్య, హుస్సేన్ బి, మక్బూల్ లకు వృద్ధాప్య పెన్షన్, ఆశీర్వాదమ్మ, పద్మావతి లకు వితంతువు పెన్షన్, పార్వతి, ఖాజా బి లకు వైకల్య పెన్షన్ ను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా పెన్షన్ లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ కలెక్టర్ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ ప్రతినెల సరైన సమయానికి వచ్చి అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తాము నివాసం ఉంటున్న ప్రదేశంలో కరెంట్ వైర్లు కిందికి ఉన్నాయని, వర్షం పడితే డ్రెయిన్లు నిండి కాలువ నీరు రోడ్ మీద ఉండడంతో దోమలు వస్తున్నాయని కలెక్టర్ కు తెలిపారు. మరికొందరు తమకు పెన్షన్ శాంక్షన్ చేయించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, డీఆర్డిఏ పీడీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పండగ వేళ గుడ్‌న్యూస్ చెప్పనున్న కేంద్రం..

మన గళం : పండగ వేళ కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తోంది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) సరవణ చేయనున్నట్లు తెలిసింది. నేడు ప్రధాని అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర మంత్రివర్గం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా తెలిపాయి. మంత్రివర్గం ఆమోదం తర్వాత సవరించిన డీఏ జులై 1 నుంచే అమల్లోకి రానుంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం లభించనుంది. ఽంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది.

# చెరువులు నింపాలి..భూగర్భ జలాలు పెంపొందించాలి




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో ఉన్న చెరువులను నింపాలని, భూగర్భజలాలను పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలో చెరువులు నింపడం, భూగర్భ జలాలు పెంపొందించడం అంశాలపై ఇరిగేషన్, భూగర్భ జల శాఖ, డ్వామా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 11 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు మరమ్మత్తులు చేయించి, వాటిని హంద్రీ నీవా నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని ఎస్ ఈ బాలచంద్రారెడ్డిని ఆదేశించారు. ఇందుకు తగిన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే జిల్లాలోని చెక్ డ్యాములను మరమ్మతులు చేసేందుకు ఎస్టిమేషన్ లు తయారు చేసి మూడు రోజుల లోపల పంపాలని డ్వామా పీడీ ని ఆదేశించారు. జిల్లాలోని మద్దికెర,ఆస్పరి తదితర మండలాలలో కొన్ని గ్రామాలు వేసవిలో తాగునీటికి ఇబ్బంది ఉండే అవకాశం ఉంటే, ఇప్పటినుండే తగు చర్యలు తీసుకొని తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇతర చెరువుల మరమ్మతులకు కావలసిన నిధుల మంజూరు కోరుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. ఇరిగేషన్ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి జిల్లాలోని నీటి వనరుల గురించి వివరిస్తూ జిల్లాలో 57 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల లో 20 ట్యాంకులను వంద శాతం నింపడం జరిగిందన్నారు. పంట పొలాలకు నీరు సరఫరా చేస్తూ ఉన్నందున మిగిలిన చెరువులు దాదాపు 75, 50 శాతం తో ఉన్నాయని, ఫిబ్రవరి మాసానికి పూర్తిస్థాయిలో నింపడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి , హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ ఈ పాండురంగయ్య , ఎంఐ ఈఈ వెంకట రాముడు , హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఈఈ గుణకర్ రెడ్డి , డ్వామా పీడీ వెంకటరమణయ్య , గ్రౌండ్ వాటర్ డి డి సన్నన్న ,సిపిఓ భారతి , ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అబ్దుల్ ఖాదర్ , ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్లు జిలాని బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ళ నిర్మాణాల లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేయాలి

మనగళం, కర్నూలు సిటీ : ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నుండి హౌసింగ్ అంశం పై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లక్ష్య సాధన లో గోనెగండ్ల, పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఓర్వకల్లు మండలాలలో పురోగతి తక్కువగా ఉందన్నారు. సంబంధిత మండలాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారం రోజులలో పురోగతి తీసుకొని రావాలన్నారు. అదే విధంగా రూఫ్ లెవెల్ స్థాయిలో ఉన్న ఇళ్లను రూఫ్ కాస్ట్ కి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో మార్చి 26 వ తేది లోపు పూర్తి చేయాల్సిన 24 వేల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వారపు లక్ష్యాలను నిర్దేశించి, అందుకు సంబంధించిన పురోగతి నివేదికలు పంపాలని కలెక్టర్ హౌసింగ్ పిడి ని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి చేసిన ముందస్తు చెల్లింపులు, అదనపు సహాయం పై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ హౌసింగ్ పిడి ని ఆదేశించారు. ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టర్ లు ఎవరైనా ఇళ్ళ నిర్మాణాలు మొదలు పెట్టకపోతే వారికి నోటీస్ లు జారీ చేసి వెంటనే ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్, పత్తికొండ ఆర్డీఓ భరత్, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి వెంకటరమణయ్య, డిఆర్డిఏ పిడి రమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ఆర్థిక ప్రయోజనం



మనగళం, కర్నూలు సిటీ : జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని, ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని పాణ్య%శీ% ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన " సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్లూరు అర్బన్ 19 వార్డ్ నందికొట్కూరు రోడ్ నందు గల "డి-మార్ట్ డిపార్ట్మెంట్ స్టోర్" ను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.%ూ% సంస్కరణల అమలు పై ఆరా తీశారు. అనంతరం జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులు పొందిన ప్రయోజనం వాస్తవ అనుభూతిని తెలుసుకున్నారు. రోజు వాడే నిత్యావసర వస్తువులు పాలు, పెరుగు, పప్పు దినుసులు, నూనె, సబ్బులు, టూత్ పెస్ట్ కొనుగోలు చేసిన వినియోగదారులను కలువగా 10% నుండి 20% మధ్య ధరలు తగ్గినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ జీఎస్టీ 2.0 విధానం వలన వ్యాపారస్తులకు తమ వ్యాపారం లాభసాటిగా ఉంటుందని, అదే విధంగా పేద మధ్యతరగతి ప్రజలకు ఆర్థికభారం తగ్గుతుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్నీ విధాలుగా మేలు చేస్తున్నారని, గత వైసీపీ పాలనలో ట్రూ అప్ ఛార్జిలతో ప్రజల పై భారం మోపితే, కూటమి పాలనలో ట్రూ డౌన్ ద్వారా విద్యుత్ ఛార్జిలను తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో లో రాష్ట విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, రాష్ట ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర విద్యా కార్పొరేషన్ డైరెక్టర్ నాగముని, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





మనగళం, నంద్యాల : నంద్యాల పట్టణం 19వ వార్డు పొన్నాపురం కాలనీలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం "ఎన్టీఆర్ భరోసా" సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా ఇంటింటికి వెళ్లి అందజేశారు. పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, పింఛన్లు అందుకున్నప్పుడు లబ్ధిదారుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. పింఛన్ల పెంపుదలలో నారా చంద్రబాబు నాయుడు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, 200 రూపాయల పింఛన్ను 1000 రూపాయలకు, అనంతరం 1,000ను 2,000కు పెంచిన ఏకైక ముఖ్యమంత్రి ఆయనేనని గుర్తుచేశారు. గత ప్రభుత్వం 2,000 రూపాయల పింఛన్ను 3,000కు పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపినా మాట తప్పిందని, ప్రజలకు సంవత్సరానికి రూ.250 మాత్రమే పెంచుతూ నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం 3,000 రూపాయల పింఛన్ను 4,000 రూపాయలకు పెంచి, అదనంగా మూడు నెలల ముందుగానే ప్రతీ లబ్ధిదారికి 1000 రూపాయల చొప్పున మొత్తం 7000 రూపాయలను మొదటి నెలలోనే పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. ఇకపై ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు అందజేయబడతాయని, ఒకటవ తేదీ ఆదివారం వస్తే 31వ తేదీన లబ్ధిదారులకు ముందుగానే పింఛన్లు ఇస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, వెంకటదాసు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, పొన్నాపురం కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు




మనగళం, కర్నూలు సిటీ : అమ్మవారి అనుగ్రహంతో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, జిల్లా సుభిక్షంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన ఎస్వీ మోహన్ రెడ్డి



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరిని బుధవారం వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మర్యాదపూర్వంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కు బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

# అమ్మవారిని దర్శించుకున్న టీజీ వెంకటేష్



మనగళం, కర్నూలు సిటీ : దేవి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని నగరంలోని ఎన్ఆర్ పేటలో టీజీబీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారిని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కౌశిక్, బొందలి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, టీడీపీ నాయకులు హనుమంతరావు చౌదరి, నిర్వాహకులు నరసింహ, లక్ష్మన్న ,మోహన్ రావు ,ఉదయ్ శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# డోన్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఆయుధాల పూజ



మన గళండోన్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఈరోజు బుధవారం డిఎస్పి శ్రీనివాసులు, రూరల్ సీఐ సీఎం రాకేష్, ఎస్సై మమతా ఆధ్వర్యంలో ఆయుధాల పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎస్సై మమత, ఏ ఎస్ ఐ గౌస్ మోదిన్, పోలీసులు, రైటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

సంక్షేమ విద్యార్థుల సమస్యలు పట్టవా?

పేరు గొప్ప..ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది సర్కారు వ్యవహరిస్తున్న తీరు. సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు అర్థాకలితో ఉంటున్నారని, వారికి మెనూ పెంచి నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పిన పాలకులు దాని అమలుకు పూనుకోవడం లేదు. ఇటీవల కాలంలో వసతిగృహాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి రాష్ట్ర వ్యాప్తంగా చాలామంది విద్యా ర్థులు చనిపోయారు. ఇంకా అనేకమంది ఆస్పత్రుల పాల య్యారు. దీంతో ప్రభుత్వం స్పందించి డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన పోషకాహారం అందిస్తామని హామీ నిచ్చింది. ఇక హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ అనేది లేకుండా చేస్తామని గొప్పలకు పోయింది.తీరా చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృృహాల్లో 7,65,705 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నారు. పదినెలల క్రితం డైట్‌చార్జీలు పెంచేందుకు అప్పటి బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ప్రస్తుత టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో వేసిన ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదనల మేరకు డైట్ చార్జీలు నలభైశాతం పెంచింది. ఉన్నతాధికారుల కమిటీ జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సూచనలను పరిగణలోకి తీసుకుని, చివరిసారిగా 2017లో మెస్ చార్జీలు పెంచినప్పుడు నిత్యావసరాల ధరలు, ప్రస్తుతం రెండురెట్లు పెరిగిన ధరలను బేరీజు వేసుకొని, సుమారు 22 రకాల నిత్యవసరాల ధరలను అధ్యయనం చేసింది. పలు సూచనలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు డైట్ చార్జీలు పెంచాలని, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు 200శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెటంచివ్వాలని ఉన్నతాధికారుల కమిటీ ప్రభుత్వం ఎదుట పలు ప్రతిపాదనలతో కూడిన రిపోర్ట్‌ను అందించింది. ఉన్నతాధికారుల కమిటీ మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని సూచన చేస్తూనే, ప్రతినెలా వసతిగృహాలకు గ్రీన్‌ఛానల్ ద్వారా డైట్ బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారుల కమిటీ కోరింది. అప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్‌పాయిజన్ ఘటనల్లో భాగంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లో విద్యార్థిని మరణించాడు. దీంతో ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించడం కోసం డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్టు తెలుస్తోంది. లేదంటే ఇంతవరకు ఆచరణకు ఎందుకు దిగలేదు? ప్రతినెలా డైట్‌చార్జీలు చెల్లించకుండా, విద్యార్థులకు పెంచిన డైట్‌చార్జీలతో డైట్ అందించడం సాధ్యపడదు. గతం కంటే నేడు పెరిగిన చార్జీలతో విద్యార్థులకు డైట్ అందిస్తున్న కారణంగా సంక్షేమ వసతి గృహాధికారులకూ డైట్‌చార్జీలు సకాలంలో చెల్లించకపోవడంతో అదనపు భారంగా మారింది. ఫైనాన్షియర్స్‌ల దగ్గర వడ్డీలు, ఇఎంఐలతో పర్సనల్ లోన్లు తీసుకుని రెగ్యులర్ మెనూ ప్రకారం భోజనం అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంకా రాష్ట్రంలో సుమారు 2300 ఎస్సీ,ఎస్టీ, బీసీ వసతి గృహాలు, 400కు పైగా గురుకులాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రయివేటు బిల్డింగ్ ఓనర్లకు కిరాయిలు చెల్లించకపోగా బిల్డింగులకు తాళాలు వేసిన సందర్భాలు లేకపోలేదు. బిల్డింగులు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఓనర్లు తగువుకు దిగుతున్న ఘటనలు చూస్తున్నాం. కనీసం కరెంట్ బిల్లులు చెల్లించకపోయినా డిస్కంలు నిరంతరాయంగా పవర్ సప్లరు చేస్తున్నాయి. సంక్షేమ వసతి గృృహాలకు, గురుకులాలకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలు, కోడిగుడ్లు,చికెన్, అరటిపండ్లు అందించే టెండరుదారులు తమ బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తేశారు. కొన్నిచోట్ల పదిహేను రోజులకు సరిపడా ఒకేసారి కూరగాయలు వేస్తే మురిగిన సందర్భాలూ లేకపోలేదు. ప్రభుత్వం ఇటు టెండర్ దారులకు, బిల్డింగ్ ఓనర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో గృహాల అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులపైన వారు తీవ్రఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇవన్నీ కూడా సంక్షేమ హాస్టల్స్ దయనీయ పరిస్థితిని తెలుపుతున్నది. దీంతో ప్రతియేటా వసతి పొందే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. నాణ్యతలేని భోజనం, అపరిశుభ్ర పరిసరాలు, వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు, అధికారుల నిర్లక్ష్యం, చాలీచాలని తిండి కారణంగా తల్లిదండ్రులు విసుగెత్తి విద్యార్థులను ఇండ్లకు తీసుకెళ్తున్నారు. వసతి గృహాల్లో, గురుకులాల్లో ప్రతి యేటా నిర్వహణ కోసం కేటాయించే బడ్జెట్ కూడా ఇవ్వకపోవడంతో శానిటేషన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత బిల్డింగులు శిథిలావస్థకు చేరడంతో పెచ్చు లూడి పడుతున్నాయి. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి వసతి గృృహాలపై దృష్టి సారించి తగు సదుపాయాలు కల్పించాలి. ఇచ్చిన హామీల మేరకు వాటి అభివృద్ధికి సహకరించాలి. అలాగే విద్యార్థులకు, తల్లిదండ్రులకు హాస్టల్స్‌పై నమ్మకం సన్నగిల్లకుండా చూడాలి. లేదంటే రానున్న రోజుల్లో వసతి గృహాలు మూతపడే పరిస్థితి దాపురిస్తుంది. అలా జరగకుండా ఉండాలంటే భావిభారత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి అవసరాలకు సరిపడా నిధుల్ని బడ్జెట్‌లో కేటాయించి విడుదల చేయాలి.

## హుసేనాపురం గ్రామంలోస్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ - ఎమ్మెల్యే కోట్లజయసూర్య ప్రకాష్ రెడ్డి




మన గళం ప్యాపిలి మండల కేంద్రంలోని హుసేనాపురంగ్రామంలో తహశీల్దారు భారతి ఆధ్వర్యంలో డోన్ శాసనసభ్యులు ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా తీర్చి దిద్దేందుకు రేషన్కార్డు దారులకు ప్రభుత్వం నూతనంగా స్మార్ట్ కార్డు లను మంజూరు చేసిందన్నారు. అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన రేషన్కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు బూత్ ఇన్చార్జులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యాపదిన్నె గ్రామంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



మన గళండోన్ మండలంలోని యాపదిన్నె గ్రామంలో నియోజకవర్గఎమ్మెల్యే కోట్లజయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు యాపదిన్నె శ్రీనివాసులు, యాపదిన్నెరంగన్న ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ నరేష్ కలిసి గ్రామంలో ప్రతి ఇంటింటికి వెళ్లి వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్లు, వితంతు పింఛన్లు113 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.


## విద్యుత్ కార్యాలయంలో ఆయుధం పూజ



మన గళండోన్ డోన్ పట్టణంలోని విద్యుత్ కార్యాలయం నందు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర సమక్షంలో సబ్ డివిజన్ కార్యాలయం నందు మరియు డోన్ పట్టణ మరియు రూరల్ కార్యాలయాల్లో దుర్గ మాతకు మరియు విద్యుత్ పరికరాలకు ఆయుధపూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఏఈ నాగేశ్వర రెడ్డి, సబ్ ఇంజనీర్ నాగరాజు, లైన్మెన్లు రవి, నారాయణ చారి, కాటమరాజు, నాగార్జున, %యిజ% రామకృష్ణ జూనియర్ లైన్మెన్, కార్యాలయ సిబ్బంది,కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కోట్ల





మన గళం బేతంచర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఉన్న ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీఘణ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా ఈరోజు బుధవారంఅమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరియు డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి శ్రీ కోట్ల సుజాతమ్మ అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించి దంపతులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు.

## వృద్ధుల బాగోగులు కుటుంబ సభ్యుల బాధ్యత




మనగళం, నంద్యాల: “ వృద్ధుల ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు శ్రద్ధ వహించాలి “ వారి బాగోగులు చూసుకోవడం బాధ్యత అని డాక్టర్ ఆర్. వెంకటరమణ సార్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ 60 సంవత్సరముల వయసు పైబడిన పురుషులు, మహిళలు ఎక్కువ శాతం రక్త పోటు, మధుమేహం, హృదయ సంబంధ, కాలేయ సంబంధ, మూత్ర సంబంధ వ్యాధులు, సమస్యలతో బాధపడుతుంటారన్నారు. కొందరు కుటుంబ సభ్యుల ద్వారా మానసిక ఆందోళన లకు గురవుతుంటారని, మతి మరుపుతో వారి మాటలు, ప్రవర్తన లో మార్పులు వస్తాయని, కొందరు పక్షవాతము, మెదడు సంబంధ, నరాల బలహీనత, విపరీతమైన వళ్ళు నొప్పులతో బాధ పడుతుంటారని చెప్పారు. ఇంట్లో కుటుంబ సభ్యులు, మనుమళ్ళు, మనుమరాళ్లు వయో వృద్దులతో సరిగా మాట్లాడకపోవడం వలన మానసికంగా కుంగు బాటుకు గురవుతారని, వయో వృద్దులకు కుటుంబ సభ్యులు అండగా ఉండాలని సూచించారు. వారితో రోజు మాట్లాడటం, వారి అవసరాలు గురించి విచారించి తీర్చడం వలన వారు సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమం లో కార్యాలయం సిబ్బంది డిప్యూటీ డెమో– రవీంద్ర నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ – గుర్రప్ప, లక్ష్మి నారాయణ, హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారి– శివరాం, నర్సప్ప, జగదీశ్, హరినాథ్ రెడ్డి, గఫార్, వంశీ, సంటెన్న పాల్గొన్నారు.


## “సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్” అవగాహన ర్యాలీని ప్రారంభించిన జేసీ



మనగళం, నంద్యాల: కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం “సూపర్ జీఎస్టీ %–% సూపర్ సేవింగ్స్” అవగాహన ర్యాలీని బుధవారం జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ రైతుల పంట ఉత్పత్తి ఖర్చులు తగ్గి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువ కావడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ట్రాక్టర్, ట్రాక్టర్ పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, బయో పెస్టిసైడ్స్, స్ప్రింక్లర్, డ్రిప్ పరికరాలు, డీజిల్ ఇంజిన్లపై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించిందన్నారు. రైతులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని లాభపడాలని పిలుపునిచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రారంభించిన అవగాహన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులలో సాగింది. ఈ సందర్భంగా వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ తగ్గింపునకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు, మండల వ్యవసాయ అధికారి నంద్యాల ప్రసాద్ రావు రైతులకు అవగాహన కల్పించారు.

# చేనేత వృత్తి చేసుకుంటున్న వారి కొట్టాల్లోకి వర్షం నీరు

## ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని కోడుమూరు నుండి కర్నూలు రూటు స్థానిక స్టేట్ బ్యాంక్ దగ్గర్లో ఎర్రన్న కట్టెల డిపో పక్క వీధిలో ముడుమలకుర్తి వారు చాలా సంవత్సరాలు నుంచి సొంత స్థలాల్లో కొట్టాలు వేసుకుని చేనేత వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు వారి వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు వారి ఇళ్లల్లోకి నీరు చేరి వారి జీవనోపాధికి చాలా ఇబ్బందిగా ఉందని స్థానికంగా నివసిస్తున్న చంద్రశేఖర్ అనే వ్యక్తి అక్కడి సమస్యను స్థానిక టిడిపి నాయకులకు తెలియజేశాడు అక్కడి సమస్యను అడిగి తెలుసుకొని సమస్య ఉన్నదని కోడుమూరు టిడిపి పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు జిడిపి చైర్మన్ కే ఈ మల్లికార్జున గౌడ్ ఎల్లప్ప నాయుడు వెంటనే టిడిపి సీనియర్ నాయకులు కేడీసీసీ ఛైర్మెన్ డి. విష్ణువర్ధన్ రెడ్డి మరియు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విషయం వివరించారు వారు వెంటనే స్థానిక అధికారులకు ఆదేశించగా కోడుమూరు తాసిల్దార్ మరియు ఎంపీడీవో ఆ ప్రాంతానికి వచ్చి అక్కడ సమస్యలు తెలుసుకొని ఆ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించడానికి సంబంధిత వ్యక్తులకు కలిసి వారికి న్యాయం చేస్తామని స్థానికులకు అధికారులు తెలియజేశారు వెంటనే స్థానిక గ్రామపంచాయతీ ఏఈ ఈ సమస్య పరిష్కారానికి డ్రైనేజ్ వేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని డ్రైనేజ్ కు కొలతలు తీసుకుని ఎస్టిమేషన్స్ పంపిస్తానని తెలిపారు. తహసీల్దారు వర్షం వల్ల నష్టపోయిన స్థానికులకు నష్ట పరిహారం నిమిత్తం ప్రభుత్వానికి నివేదికలు తయారు చేసి పంపిస్తామని అన్నారు. వెనువెంటనే వారికి న్యాయం జరుగుతుందని స్థానికులు డి. విష్ణు వర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్థానిక టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు

## కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం






మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారిని పి.ఎల్. వరలక్ష్మి మేడం మరియు ఏపీఎంఐపీ పిడి శ్రీనివాసులు మరియు జీఎస్టీ డిపార్ట్మెంట్ రమాదేవి మేడం మరియు తాసిల్దార్ ఎంపీడీవో మండల వ్యవసాయ అధికారి రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు గ్రామ రైతులు ఉగాది వెంకటేశ్వర్లు, సీతారాముడు, కిరణ్, జర్మన్ భాష,షేక్ మిన్నెల, మొదలగున వారు పాల్గొనడం జరిగినది. సమావేశ అనంతరం గ్రామంలో అధికారులు మరియు రైతులు కలిసి వ్యవసాయ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, డ్రోన్ వంటి పరికరాలతో ర్యాలీ నిర్వహిస్తూ తగ్గిన జీఎస్టీ గురించి ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు కూడా తగ్గినటువంటి జిఎస్టి ను వినియోగించుకోవాలని వ్యవసాయ ట్రాక్టర్ల పైన పనిముట్ల పైన గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ ని ఏడు శాతం తగ్గిస్తూ ఇప్పుడు ఐదు శాతం కుదింపు చేశారని వారు తెలియజేశారు అలాగే డ్రిప్పు పరికరాల పైన స్ప్రింక్లర్ల పైన తగ్గింపు చేయడం జరిగిందన్నారు సూక్ష్మ పోషకాల పైన బయోపిస్టిసైడ్స్ పైన తగ్గింపు చేయడం అలాగే పాడి పరిశ్రమలో పాల క్యాన్ల కొనుగోలులో జీఎస్టీ 12 శాతం నుంచి ఐదు శాతం కు తగ్గించడం అందరూ గమనించాల్సిందిగా వారు తెలియజేశారు అలాగే వ్యవసాయ మరియు అనుబంధ శాఖలలో తగ్గినటువంటి జీఎస్టీ ని మండలంలోని ప్రతి గ్రామంలోని ఆర్ఎస్కే లో మీటింగ్ ఏర్పాటు చేసి రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు మరియు రైతు సేవ కేంద్ర సిబ్బంది స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు

# బంగారం ధర మరింత పెరిగింది..

## ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

మన గళం : బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 1న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 17, 450కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 07, 660కి చేరింది . నిన్నటితో పోల్చుకుంటే దాదాపు వెయ్యి రూపాయల మేర బంగారం ధర పెరిగింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 17, 600కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 07, 810కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 17, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 07, 660కి చేరింది (%+శీశ్రీ౹ జుతీఊవ అఅ ఎఎవతీఘుఝఎ%). వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# ఆర్బీఐ రెపోరేట్ జోష్.. లాభాల్లోకి సూచీలు..




మన గళం : గత ఎనిమిది సెషన్లుగా వరుసగా నష్టాలనే చవిచూస్తున్న దేశీయ సూచీలకు ఆర్బీఐ రెపోరేట్ జోష్ అందించింది. ఆర్బీఐ రెపోరేట్‌ను మరోసారి యథాతథంగా ఉంచుతున్నట్టు ప్రకటించడం మార్కెట్లకు కలిసొచ్చింది. బ్యాంకింగ్ సెక్టార్‌లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు ఆ తర్వాత లాభాల బాట పట్టాయి. ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతన్నాయి. మంగళవారం ముగింపు (80, 267)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి ఎగబాకింది. ఆర్బీఐ వడ్డీ రేట్ల ప్రకటన తర్వాత కనిష్టం నుంచి ఏకంగా 400 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:50 గంటల సమయంలో సెన్సెక్స్ 292 పాయింట్ల లాభంతో 80, 560 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 76 పాయింట్ల లాభంతో 24, 687 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో హడ్కో, లూపిన్, టాటా మోటార్స్, వోడాఫోన్ ఐడియా, ఆర్ఈసీ, ట్రెంట్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఆర్బీఎల్ బ్యాంక్, డెలివరీ, ఎస్బీఐ కార్డ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 27 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 374 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.72గా ఉంది.

## వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం!



మన గళం : సామాన్యులకు మరోసారి ఆర్బీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఈరోజు జరిగిన సమావేశంలో వడ్డీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటు యథాతథంగా ఉంచుతూ ప్రజలకు తీపి కబురు అందించింది. కాగా రెపో రేటు 5.5 శాతం యథాతథంగా ఉండనుంది. అయితే ఆర్బీఐ రేపో రేటులను స్థిరంగా ఉంచండం ఇది రెండో సారి. అయితే.. తాజా ఆర్బీఐ ప్రకటనతో మనం కట్టే ఈఎంఐలలో ఎలాంటి మార్పులు ఉండవు. దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే దిశగా ఆర్బీఐ అడుగులు వేస్తోంది. అయితే ఇటీవల అతర్జాతీయంతో పాటు మన దేశంలో నెలకొన్న కొన్ని పరిస్థితుల కారణాలతో ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్ లో జరిగిన సమావేశంలో రేపో రేట్లను 0.25 శాతం చొప్పున తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. జూన్ నెలలో నిర్వహించిన సమావేశంలో ఆర్బీఐ ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కాగా ఇలా వరుసగా మూడు కీలక సమావేశాల్లో ఆర్బీఐ.. రేపో రేటును 1 శాతం మేర తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై విధించిన పన్నుల భారం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు నెలలో రేపో రేటు మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే అక్టోబర్ నెలలో కూడా రేపో రేటును యథాతథంగా ఉంచుతూ ప్రకటన విడుదల చేసింది.

# సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గిన ఆటో మొబైల్ సేల్స్..

మన గళం : సెప్టెంబర్‌లో రిటైల్ ఆటోమొబైల్ సేల్స్ దాదాపు 13శాతం పడిపోయాయి. పండుగ సీజన్‌కు ముందు నెలాఖరు నాటికి డిమాండ్ మొదలైంది. దాంతో ఆటో కంపెనీలకు ఊరట కలుగడంతో పాటు అక్టోబర్‌పై ఆశలను రేకెత్తించింది. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నాటికి మొత్తం 1.51 మిలియన్ వాహనాలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1.74 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది 13.28 శాతం తగ్గింది. ఈ గణాంకాలు రిజిస్ట్రేషన్స్ మాత్రమే ప్రతిబింబిస్తాయని.. పూర్తి డెలివరీల వివరాలు కొద్దిరోజుల తర్వాత మాత్రమే తెలుస్తుందని ఆటో పరిశ్రమ నిపుణులు తెలిపారు. సెప్టెంబర్ తొలి మూడువారాల్లో కొనుగోళ్లు మందగించాయి. పండుగ ఆఫర్లు, జీఎస్టీ రేట్లలో మార్పుల్లో స్పష్టత కోసం కొనుగోలుదారులు వాహనాలను కొనుగోలు చేయకుండా నిరీక్షించినట్లుగా పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో పితృపక్షాలు సైతం షాపింగ్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 22న నవరాత్రుల ప్రారంభం నుంచే మార్కెట్‌లో సందడి కనిపించిందని.. జీఎస్టీ సంస్కరణలతో ధరలు సైతం తగ్గడంతో షోరూమ్స్ సందడిగా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల విభాగాల షోరూమ్‌ల్లో కస్టమర్ల రద్దీ, బుకింగ్‌లు, ఎక్వైరీలు పెరిగాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సెప్టెంబర్ 22 నుంచి 25 మధ్య కేవలం నాలుగు రోజుల్లో 75వేల వాహనాలను విక్రయించింది. మారుతి ఆగస్టు నెల మొత్తంలో సుమారు 1.35లక్షల యూనిట్లను విక్రయించింది. నెలాఖరు నాటికి డిమాండ్ ఎంత వేగంగా పెరిగిందో గణాంకాలు చెబుతున్నాయి. గత సంవత్సరం అక్టోబర్‌లో నవరాత్రి వేడుకలు ప్రారంభం కాగా.. పండుగల ప్రభావం సెప్టెంబర్‌లో కనిపించలేదు. ఈ సంవత్సరం సెప్టెంబర్ చివరి వారంలో డిమాండ్ కనిపించింది. ఇక రాబోయే నెలల్లో అమ్మకాలు జోరుగా సాగుతాయని ఆటోమొబైల్ ఇండస్ట్రీ భావిస్తున్నది. అక్టోబర్‌లో పండుగలు కొనసాగనున్నాయి. ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. పెట్రోల్ కార్లపై (1200సీసీ వరకు), డీజిల్ కార్లపై (1500 సీసీ వరకు) 18శాతానికి జీఎస్టీ తగ్గింది. అంతకంటే ఎక్కువ సీసీ కలిగిన వాహనాలపై 40శాతం.. ఇక ఎలక్ట్రికల్ వాహనాలపై కేవలం 5శాతం జీఎస్టీ పరిమితం చేయడంతో పరిశ్రమకు ఊతమిస్తుందని ఆటో ఇండస్ట్రీ భావిస్తున్నది.

# పండుగల వేళ పెరిగిన గ్యాస్ ధర..

## కమర్షియల్ సిలిండర్‌పై రూ.15.50 వడ్డన..!

మన గళం : గ్యాస్ ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. పండుగ వేళ గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.15.50 మేరకు పెంచినట్టు ప్రకటించాయి. దాంతో వాణిజ్య సిలిండర్ ధర రూ.1595.50కి పెరిగింది. కీలక పండుగలకు ముందు వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే హొటల్స్, రెస్టారెంట్లతో పాటు పలు రంగాలను ప్రభావితం చేయనున్నది. సవరించిన రేట్ల ప్రకారం.. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.15.50 పెరగ్గా.. ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1,595.50 పెరిగింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో రూ.1,547, చెన్నైలో రూ.1,754, కోల్‌కతాలో రూ.1,700కి పెరిగింది. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేదు. దాంతో గృహ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించినట్లయ్యింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర ముంబయిలో రూ.852.50, ఢిల్లీలో రూ.853, చెన్నైలో రూ.868.50, కోల్‌కతాలో రూ.879, హైదరాబాద్‌లో రూ.925గా ఉన్నది. వాస్తవానికి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ప్రభుత్వ విధానాలు, పన్ను విధానంలో మార్పులు, డిమాండ్ సరఫరాల్లో సీజనల్ మార్పులు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఆయిల్ కంపెనీలు ఖర్చులు ఆదాయం తదితర అంశాల ఆధారంగా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తూ వస్తాయి. అయితే, మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం సామాన్యులపై పడకుండా ప్రభుత్వం గృహవినియోగ సిలిండర్ల ధరలను నియంత్రిస్తుంది. డొమెస్టిక్ గ్యాస్ ధరలను ప్రభుత్వం నియంత్రిస్తుండడంతో జనాలకు ఊరట కలుగుతున్నది. అయితే, వాణిజ్య సిలిండర్ల ధరలను మాత్రం ప్రతినెలా మారుతుంటాయి. ఒక్కో సందర్భంలో ధరలు తగ్గుతుంటాయి. అయితే, గత సెప్టెంబర్‌లో ధరలు పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ధరలు పెరగడంతో హొటల్స్, క్యాటరింగ్ సేవలు తదితర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. ఇవన్నీ రోజువారీ కార్యకలాపాల కోసం ఎల్‌పీజీపైనే ఆధారపడుతుంటాయి. సిలిండర్ ధర పెరగడంతో ఈ వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఖర్చులను వినియోగదారుల నుంచి రాబట్టేందుకు ధరలను పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# యూనిక్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్



మన గళం: విష్ణు విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఆర్యన్'. డార్క్ అండ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని శుభ్ర, ఆర్యన్ రమేష్‌తో కలిసి విష్ణు విశాల్ స్టూడియోస్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా తమిళం, తెలుగు భాషలలో విడుదల కానున్న ఈ చిత్ర టీజర్ మంగళవారం విడుదలైంది. ఒక థ్రిల్లింగ్ హత్య దర్యాప్తు, విష్ణు విశాల్ పాత్రను ఆసక్తికరంగా పరిచయం చేస్తూ ఈ టీజర్ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌ని తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకున్నారు. 34 నెలల విరామం తర్వాత విష్ణు విశాల్ ఈ శక్తివంతమైన టీజర్‌తో సోలో లీడ్‌గా కమ్ బ్యాక్ ఇచ్చారు.

'రాట్ససన్' విజయం తర్వాత, విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటించగా, సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్,అభిషేక్ జోసెఫ్ జార్జ్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఒక యూనిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా దర్శకుడు ప్రవీణ్ కె దీన్ని తెరకెక్కించారు అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి డీఓపీ– హరీష్ కన్నన్, సంగీతం – జిబ్రాన్, ఎడిటర్ శాన్ లోకేష్. స్టంట్ సిల్వా, పిసి స్టంట్స్ ప్రభు, ఎడిషల్ స్క్రీన్ ప్లే మను ఆనంద్, ప్రొడక్షన్ డిజైన్ ఎస్.జయచంద్రన్.

# ఆకట్టుకుంటున్న ధనుశ్ 'తేరే ఇష్క్ మే' టీజర్




మన గళం : ప్రముఖ నటుడు ధనుశ్, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ కలయికలో వచ్చిన 'రాంజానా' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు ఈ విజయవంతమైన కాంబినేషన్‌లో 'తేరే ఇష్క్ మే' అనే మరో ఆసక్తికర చిత్రం రాబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. టీజర్‌ను బట్టి చూస్తే, ఇది ఒక తీవ్రమైన, భావోద్వేగభరితమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా టీజర్‌లో ధనుశ్ చెప్పిన ఓ డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నా తండ్రి దహన సంస్కారాల కోసం బనారస్ వెళ్లాను. అప్పుడే నీకోసం కాస్త గంగాజలం తీసుకురావాలనిపించింది. నువ్వు కొత్త జీవితం మొదలుపెడుతున్నావు కదా, కనీసం నీ పాత పాపాలను అయినా కడుక్కో" అంటూ కథానాయిక కృతి సనన్‌ను ఉద్దేశించి ధనుశ్ చెప్పే డైలాగ్ బాగుంది. ప్రేమలో మోసపోయిన ఓ యువకుడి ఆవేదన ఆయన పాత్రలో కనిపిస్తోంది. ఈ చిత్రంలో ధనుశ్ ఒక ఎయిర్‌ఫోర్స్ అధికారిగా నటించనున్నారు. ఆయన సరసన కృతి సనన్ కథానాయికగా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి హిమాన్షు శర్మ, నీరజ్ యాదవ్ కథను అందించారు.

# నటి డింపుల్ హయాతి దంపతులపై కేసు



మన గళం : టాలీవుడ్ తెరపై అందాల తారగా మెరిసిన డింపుల్ హయాతి ఇప్పుడు వరుస వివాదాలతో అట్టుడికిపోతోంది. ఇప్పటికే ట్రాఫిక్ డీసీపీ కారు వివాదంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా పనిమనిషి చేసిన సంచలన ఆరోపణలతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసు వివరాలు వింటే అందరూ షాక్ అవుతున్నారు. ఒడిశాకు చెందిన ఓ యువతి, డింపుల్ హయాతి దంపతుల వద్ద పనిచేసేందుకు వచ్చింది. అయితే, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో డింపుల్ దంపతులపై కేసు నమోదైంది. పనిమనిషిని దారుణంగా హింసించారని, వేధించారని ఫిర్యాదులో పేర్కొంది. వారికి సేవ చేసినందుకు జీతం కూడా ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించింది. వారి పెంపుడు కుక్క మొరిగితే, ఆ నెపాన్ని తనపై వేసి నిర్లక్ష్యం అంటూ నిందించేవారని తెలిపింది.అన్నింటికంటే దారుణంగా, డింపుల్ హయాతి, ఆమె భర్త కలిసి తనను బట్టలు విప్పడానికి ప్రయత్నించారని , కొట్టడానికి సిద్ధమయ్యారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ సంఘటనతో తాను తీవ్ర మానసిక గాయానికి గురయ్యానని తెలిపింది. పనిమనిషి స్టేట్‌మెంట్ ఆధారంగా, పోలీసులు కేసు నమోదు చేసి 'ఇంటి దౌర్జన్యం' కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చుతున్న శాన్వి మేఘన



మన గళం : సినిమా ఇండస్ట్రీలో ఎన్ని సినిమాలు చేశాం అన్నది కాదు ఎంత క్రేజ్ తెచ్చుకున్నాం అనేది ముఖ్యం.. చాలా మంది హీరోయిన్స్ పదుల సంఖ్యలో సినిమాలు చేసినా అంతగా గుర్తింపు తెచ్చుకోరు. కానీ కొంతమంది భామలు మాత్రం ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోతున్నారు. ఇప్పటికే చాలా మంది యంగ్ బ్యూటీ తక్కువ సినిమాలతో పాపులర్ అయ్యి.. ఇప్పుడు బిజీ బిజీగా గడుపుతున్నారు. వారిలో శాన్వి మేఘన ఒకరు. శాన్వి మేఘన 1998 సెప్టెంబరు 12న హైదరాబాద్‌లో జన్మించింది. ఈ ముద్దుగుమ్మ 2019లో "సైరా నరసింహారెడ్డి" సినిమాతో తన సినీ జర్నీని ప్రారంభించింది. ఆ తర్వాత "పిట్ట కథలు" , "బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్", "పుష్పక విమానం", "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్" వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. "పుష్పక విమానం"లో ఆమె షార్ట్ ఫిల్మ్ హీరోయిన్‌గా చేసిన పాత్ర ప్రేక్షకులను మెప్పించింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు ఆరు సినిమాలు చేసింది. అలాగే తమిళ్ లో ఓ సినిమా చేసింది. తమిళ్ లో ఆమె కుటుంబస్థాన్ అనే సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగులో రీసెంట్ గా టుక్ టుక్ అనే సినిమా చేసింది. చేసిన సినిమాలన్ని మంచి టాక్ సొంతం చేసుకున్నా ఈ భామకు మాత్రం అంతగా గుర్తింపు రాలేదు. సినిమా పరిశ్రమలో తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తోంది ఈ అమ్మడు. ఇప్పటికైన ఈ అమ్మడికి పెద్ద సినిమా ఆఫర్స్ వస్తాయేమో చూడాలి.

# సూపర్ హిట్ హారర్ థ్రిల్లర్ మూవీ స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

మన గళం : సెప్టెంబర్ 12న థియేటర్లలో రిలీజైన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. మరో బ్లాక్ బస్టర్ మూవీ మిరాయ్ కు పోటీ తట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబట్టింది. ఆడియెన్స్ ను బాగా భయపెట్టిన ఈ హారర్ థ్రిల్లర్ మూవీ ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం కిష్కింధపురి. రాక్షసుడు వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సాయి శ్రీనివాస్, అనుపమ కాంబినేషన్ లో వచ్చిన రెండో సినిమా ఇది.కౌశిక్ పెగళ్లపాటి తెరకెక్కించిన ఈ హారర్ థ్రిల్లర్ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్లలో రిలీజైంది. ఏ మాత్రం అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. థియేటర్లలో ఆడియెన్స్‌ను భయపెట్టి మంచి థ్రిల్ పంచింది. మెగాస్టార్ చిరంజీవి తదితర సినీ ప్రముఖులు కిష్కింధపురి సినిమాను చూసి ప్రశంసించారు. తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈమూవీ ఓవరాల్ గా రూ. 25 కోట్లకు పైగానే కలెక్షన్లు రాబట్టినట్లు సమాచారం. ఇప్పుడీ కిష్కింధపురి సినిమా ఓటీటీ ఆడియెన్స్ ను భయపెట్టేందుకు డిజిటల్ స్ట్రీమింగ్ కు రానుందని టాక్. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 సొంతం చేసుకుంది. ఈ సినిమాకు బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు వచ్చాయి. దీంతో ఓటీటీ రైట్స్ కూడా భారీ రేటుకు అమ్ముడుపోయినట్లు సమాచారం. కాగా థియేట్రికల్ రన్ దాదాపు పూర్తి కావడంతో కిష్కింధపురి సినిమాను ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అయ్యిందని సమాచారం. అక్టబర్ 17 నుంచి ఈ హారర్ థ్రిల్లర్ మూవీ స్ట్రీమింగ్ కు రానున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన రానుందని సమాచారం. షైన్ స్క్రీన్స్ సాహు గారపాటి నిర్మించిన కిష్కింధపురి సినిమాలో శాండీ మాస్టర్ విలన్ గా నటించాడు. మకరంద్ దేశ్ పాండే,



తనికెళ్ల భరణి, శ్రీకాంత్ అయ్యంగర్, హైపర్ ఆది, సుదర్శన్, భద్రం తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. చేతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. ఇక సినిమా కథ విషయానికి వస్తే.. కిష్కింధపురిలోని సువర్ణమాయ అనే ఓ పాడుబడిన ఇంట్లో కొందరు ఘోస్ట్ హంటర్స్ సాగించే వేట ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. మొత్తం 11 మంది ఆ ఇంటికి వెళ్తారు. మొదట్లో సాదాసీదాగా కనిపించినా ఆ తర్వాత అందులో ముగ్గురు అనూహ్యంగా చనిపోతారు. దీంతో అసలు కథ మొదలవుతుంది. ఆతర్వాత ఏం జరిగిందో తెలుసుకోవాలంటే కిష్కింధపురి సినిమా చూడాల్సిందే.

# మెగాస్టార్ సరసన 'శశిరేఖ'.. ఆకట్టుకుంటున్న నయనతార

మన గళం : మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నయనతార పాత్ర పేరుతో పాటు ఆమె ఫస్ట్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రంలో నయనతార 'శశిరేఖ' అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించారు. పాత్రకు సంబంధించిన లుక్‌ను కూడా విడుదల చేయగా, అది ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉండగా, దసరా పండగ సందర్భంగా రేపు మరో సర్‌ప్రైజ్ కూడా రాబోతోందని అనిల్ రావిపూడి తన పోస్టులో పేర్కొన్నారు. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. పండగ రోజు రాబోయే ఆ కొత్త కబురు ఏమై ఉంటుందా? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ కూడా ఓ ముఖ్యమైన పాత్రలో నటిస్తుండటం విశేషం. చిరంజీవి, వెంకటేశ్ వంటి అగ్ర తారలు కలిసి నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని గతంలోనే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.



# ఆసియా కప్ ట్రోఫీ వివాదం..



మన గళం : ఆసియా కప్ 2025 ట్రోఫీ చుట్టూ నడుస్తున్న వివాదం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మోహ్సిన్ నఖ్వీ ఈ వివాదంపై స్పందిస్తూ, ట్రోఫీని తనతో తీసుకెళ్లిన విషయంలో భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ)కి క్షమాపణలు తెలిపినట్లు సమాచారం. ఇది క్రికెట్ డిప్లమసీలో ఒక పాజిటివ్ స్టెప్‌గానే భావించబడుతోంది.

అయితే, ట్రోఫీ తిరిగిచ్చే విషయంలో నఖ్వీ ఓ కండిషన్ పెట్టినట్టు తెలుస్తోంది. ఆయన చెబుతోన్నదాని ప్రకారం, ట్రోఫీని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్వయంగా ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఆఫీస్‌కు వచ్చి స్వీకరించాల్సిందే. ఇది సాధారణ శిష్టభద్రత చర్య కాదని, వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన విషయమని పాకిస్థాన్ మీడియా చెబుతోంది. ఈ షరతుపై బీసీసీఐ ఇంకా అధికారికంగా స్పందించలేదు. ట్రోఫీ స్వీకరణకు టీమిండియా కెప్టెన్‌ను పాక్‌లోని ఏసీసీ ఆఫీస్‌కు పంపించాలన్న నఖ్వీ డిమాండ్‌ను బీసీసీఐ ఎలా సమాధానమిస్తుంది అనే దానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ వివాదం క్రికెట్ డిప్లమసీకి తలనొప్పిగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్-భారత్ క్రికెట్ సంబంధాలు రాజకీయ కారణాల వల్ల తేలికగా లేవు. ఈ ట్రోఫీ వివాదం నేపథ్యంలో రెండు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య సంబంధాలు మరింత సంక్లిష్టంగా మారే అవకాశం ఉంది. ఏసీసీ అధ్యక్షుడిగా నఖ్వీ చురుగ్గా వ్యవహరించడంతో పాటు, ఈ వివాదానికి పరిష్కారం చూపే మార్గం కూడా ఆయన చేతులలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# భారత్‌తో ఓటముల పర్యవసానం.. పాక్ ప్లేయర్లపై పీసీబీ ఉక్కుపాదం!



మన గళం : ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాభవం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఓటమిని అత్యంత తీవ్రంగా పరిగణించిన పీసీబీ, తమ ఆటగాళ్లపై కఠిన చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది. ఇకపై పాక్ క్రికెటర్లు విదేశీ టీ20 లీగుల్లో పాల్గొనకుండా నిరోధించాలని బోర్డు సంచలన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విదేశీ లీగుల్లో ఆడాలంటే ఆటగాళ్లు తమ దేశ క్రికెట్ బోర్డు నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందడం తప్పనిసరి. అయితే, ఇకపై తమ ఆటగాళ్లకు ఈ ఎన్‌వోసీలు జారీ చేయకూడదని పీసీబీ భావిస్తోంది. ఆసియా కప్‌లో ఒకే టోర్నీలో మూడుసార్లు భారత్ చేతిలో ఓడిపోవడం, ఫైనల్‌లో కప్ చేజార్చుకోవడంతో బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రికెట్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ అహ్మద్ ఇప్పటికే కీలక ప్రకటన చేసినట్లు వార్తలు వస్తున్నాయి. విదేశీ లీగుల్లో ఆడటం వల్ల ఆటగాళ్లలో నిలకడ లోపిస్తోందని, వారి ప్రదర్శనపై తీవ్ర ప్రభావం పడుతోందని పీసీబీ భావిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ నిర్ణయం పాక్ క్రికెటర్లకు ఆటపరంగానే కాకుండా ఆర్థికంగానూ పెద్ద దెబ్బేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పీసీబీ నుంచి వచ్చే జీతభత్యాలు అంతంతమాత్రంగానే ఉంటాయి. విదేశీ లీగుల ద్వారా వారు భారీ మొత్తంలో ఆర్జించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, విదేశీ పిచ్‌లపై, అంతర్జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో ఆడటం ద్వారా వారి నైపుణ్యాలు కూడా మెరుగవుతాయి. ఇప్పటికే స్వదేశంలో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పాకిస్థాన్ క్రికెట్‌కు ఈ నిర్ణయం మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటగాళ్ల ఎదుగుదలను అడ్డుకుంటూ బోర్డు తీసుకుంటున్న ఈ కఠిన వైఖరి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# సుమీత్ హ్యాట్రిక్ ప్రపంచ పారా అథ్లెటిక్స్



మన గళం : న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ఫేవరెట్ సుమీత్ అంటిల్ వరుసగా మూడో పసిడి సాధించగా.. ఎఫ్-44 విభాగంలో సందీప్ సంజయ్ సాగర్, సందీప్ చౌధురి స్వర్ణ, రజతాలు కొల్లగొట్టారు. మంగళవారం జరిగిన పురుషుల ఎఫ్-64 ఫైనల్లో సుమీత్ 71.37 మీ. దూరం విసిరి టాప్‌లో నిలిచాడు. 2023, 2024లో కూడా అంటిల్ పసిడి పతకాలు నెగ్గాడు. పురుషుల ఎఫ్-44 కేటగిరీలో సందీప్ సాగర్ 62.82 మీటర్లు విసిరి టాప్‌లో నిలిచాడు. చౌధురి 62.67 మీటర్ల దూరం విసిరి రజతం దక్కించుకొన్నాడు. పురుషుల ఎఫ్-56 డిస్కస్ త్రోలో యోగేష్ కథూనియా 42.49 మీ. దూరం విసిరి రజతం సాధించాడు. కాగా, తెలంగాణకు చెందిన బానోతు అకీరా నందన్ పురుషుల 400 మీ. టీ38 కేటగిరి హీట్-1లో 50.55 సెకన్ల టైమింగ్‌తో ఫైనల్‌కు అర్హత సాధించాడు.





# ఐసీసీ వుమెన్స్ వరల్డ్ కప్..



మన గళం : ఐసీసీ వన్డే వుమెన్స్ వరల్డ్ కప్‌కు భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. భారత్-శ్రీలంక మధ్య మంగళవారం తొలి మ్యాచ్ జరిగింది. ఈ ప్రారంభ మ్యాచ్‌ను చూసేందుకు దాదాపు 23వేల మంది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. ఇది ఐసీసీ మహిళల టోర్నమెంట్ గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డు కావడం విశేషం. మంగళవారం జరిగిన మ్యాచ్‌ను 22,843 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. గతేడాది దుబాయిలో జరిగిన వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌కు 15,935 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. తాజాగా ఐసీసీ వుమెన్స్ ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్ 22,843 మంది హాజరయ్యారని.. ఇది ఐసీసీ వుమెన్స్ టోర్నమెంట్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 59 పరుగుల తేడాతో గెలిచి ఈ టోర్నీ గ్రాండ్‌గా ప్రారంభించింది.

దీప్తి శర్మ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళా జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించింది. దీప్తి, అమంజోత్ కౌర్ అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. దాంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 47 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 269 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. దీప్తి బ్యాట్‌తో పాటు బంతితో అద్భుతంగా రాణించింది. మూడు వికెట్లు పడగొట్టింది. శ్రీలంక తరఫున 43 పరుగులతో చమరి అటపట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. నీలాక్షి డిసిల్వా 35, హర్షిత సమరవిక్రమ 29, అచ్చిని కులసూర్య 17 పరుగులు చేశారు. దీప్తి మూడు వికెట్ల పడగొట్టగా.. స్నేహ రాణా, శ్రీ చరణి చెరో రెండు వికెట్లు తీశారు. క్రాంతి గౌడ్, అమంజోత్ కౌర్, ప్రతీకా రావల్‌కు చెరో వికెట్ దక్కింది.

# వరుసగా నాలుగో వారం కూడా అదే రంజు.. వన్డే వరల్డ్ కప్‌లో భారత్ పాక్ హై టెన్షన్ మ్యాచ్



మన గళం : భారత్, శ్రీలంక సంయుక్త ఆధ్వర్యంలో మహిళల వన్డే వరల్డ్ కప్ ఇప్పటికే మొదలైంది. ఈ ఐసీసీ ఈవెంట్‌లో, రాబోయే అక్టోబర్ 5, ఆదివారం నాడు భారత్, పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య మరో క్రికెట్ యుద్ధం జరగనుంది. వరుసగా నాలుగో ఆదివారం కూడా భారత్-పాక్ పోరు జరుగుతుండటం అభిమానులకు పెద్ద పండుగే. మరోసారి ఆదివారం వచ్చింది. భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ కోసం అభిమానులు సిద్ధంగా ఉన్నారు. ఇది వరుసగా నాలుగో వారం, భారత్-పాక్ పోరుతో క్రికెట్ అభిమానులకు ఫుల్ థ్రిల్ దొరకబోతోంది. అయితే, ఈసారి పాకిస్తాన్‌కు ఓటమి రుచి చూపించే పనిని భారత అమ్మాయిలు చేయబోతున్నారు. ఈ ఆదివారం సూర్యకుమార్ యాదవ్ టీమ్ ఇండియా కాదు, హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా జట్టు పాకిస్తాన్‌ను చిత్తు చేయనుంది. భారత్-పాకిస్తాన్ మధ్య ఈ కీలక పోరు మహిళల వన్డే వరల్డ్ కప్?లో జరగనుంది. ఈ తాజా పోరుకు ముందు, గత మూడు ఆదివారాలలో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత పురుషుల క్రికెట్ జట్టు పాకిస్తాన్‌ను ఘోరంగా ఓడించింది. భారత పురుషుల జట్టు ఆసియా కప్ 2025 లో మొదటిసారి గ్రూప్ దశలో సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో తలపడింది. ఆ తర్వాత సెప్టెంబర్ 21న సూపర్-4 రౌండ్‌లో మళ్లీ ఓడించింది. చివరగా, సెప్టెంబర్ 28న జరిగిన ఆసియా కప్ 2025 ఫైనల్‌లో కూడా భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తుగా ఓడిపోయింది. ఇప్పుడు అక్టోబర్ 5న భారత్, పాకిస్తాన్ మహిళల జట్లు ముఖాముఖి తలపడనున్నాయి. కొలంబో మైదానంలో జరగనున్న ఈ మ్యాచ్‌లో, భారత మహిళా జట్టు పాకిస్తాన్‌పై తమ రికార్డును 12-0 కు పెంచుకోవడానికి గట్టిగా ప్రయత్నిస్తుంది. గత 20 ఏళ్లలో భారత్, పాకిస్తాన్ మహిళల జట్లు వన్డే ఫార్మాట్‌లో 11 సార్లు తలపడ్డాయి. ఈ 11 మ్యాచ్‌లలోనూ విజయం పూర్తిగా భారత్‌కే దక్కింది. అంటే, పాకిస్తాన్‌పై భారత మహిళా జట్టుకు అద్భుతమైన 11-0 రికార్డు ఉంది. ఈసారి 12వ సారి వన్డేలలో భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. భారత మహిళా జట్టు ఇప్పటివరకు ప్రదర్శించిన ఆధిపత్యాన్ని బట్టి చూస్తే, ఈ ఆదివారం కూడా పాకిస్తాన్‌పై 12-0 రికార్డు ఖాయమని క్రికెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత అమ్మాయిలు తమ అద్భుతమైన ప్రదర్శనతో పాకిస్తాన్‌కు మరోసారి ఓటమిని రుచి చూపించడం ఖాయంగా కనిపిస్తోంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310